
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

మంగళవారం 27 మే 2025



ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో ఆరుగురు డీబార్

జగిత్యాల, మే26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి బొప్పరాతి నారాయణ తెలిపారు. కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నలుగురు, కోరుట్ల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులను రాష్ట్ర పరిశీలన బృందం డీబార్ చేసినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం పరీక్షలకు 1,970 మంది విద్యార్థులకు గాను 1,870 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 581 మంది విద్యార్థులకు గాను 543 మంది హాజరయ్యారని తెలిపారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

భూభారతి అమలులో

సర్వేయర్ల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ బీఎస్ లత

8

- ధర్మపురిలో భక్తుల రద్దీ

7



వన మహోత్సవానికి సన్నద్ధం

- జిల్లాలో 49.98 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- జోరుగా పదో విడత హరితహారం
- రహదారులకు ఇరువైపులా గుంతలు తీయడంపై దృష్టి

జగిత్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పచ్చదనాన్ని విస్తరింపజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం యేటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేప డుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం పేరుతో కార్య క్రమాన్ని నిర్వహించగా కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటుతోంది. ఈ ఏడాది జిల్లాలో 49.98 లక్షల మొక్కలు నాటాలని వివిధ ప్రభుత్వశాఖలకు లక్ష్యాలు కేటాయించారు. అధికారులు, ప్రజాప్రతి నిధుల భాగస్వా మ్యంతో డీఆర్‌డీఏ, అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో జూన్ మొదటి వారంలో మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్త న్నారు. జిల్లాలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందించారు.

● ఇంటింటికి మొక్కలు పంపిణీ

జిల్లాలో పదోవిడత హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించ నున్నారు. ప్రజలు అడిగిన మొక్క లను అందజేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఇళ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషధ మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేస్తున్నారు. పలు మొక్క టలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రణాళిక రూపొందించారు. దీంతో పాటు అటవీ ప్రాంతాల్లో మరింత ఆహ్లాదాన్ని పెంచే విధంగా పలు పూల, పండ్ల మొక్కలను నాటేం దుకు సిద్ధమవుతున్నారు.

● ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యం..

జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని ఉన్నతా ధికారులు విధించారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 38.43లక్షల మొక్క లు నాటాలని లక్ష్యం నిర్దేశించారు. వ్యవసాయశాఖ 1.62 లక్షలు, ఆర్అండ్‌బీ 55 వేలు, నీటి పారుదలశాఖ 22వేలు, రెవెన్యూ 28వేలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖ 7.81 లక్షలు, గృహనిర్మాణ శాఖ 55వేలు, విద్యాశాఖ 2 వేలు, పశు సంవర్ధక శాఖ ఒక వెయ్యి, మైన్స్ అండ్ జియోలాజీ 12 వేలు, యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చర్ 5 వేలు, సివిల్ సప్లయి 5 వేలు, ఇతర శాఖలు 1.44 లక్షల మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని విధించారు.

● నర్సరీల్లో మొక్కలు సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామా లు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఎదు రైన అనుభవాలు, తప్పిదాలు పునరావృత్తం కాకుండా అవసరమైన జాగ్ర త్తలను అధికారులు తీసుకుంటున్నారు. పదో విడత హరితహారంలో జిల్లాలో 49.98 లక్షల మొక్కలు వివిధ ప్రభుత్వ శాఖలకు లక్ష్యాలు కేటాయించారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, రాయికల్, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో 12 నర్సరీ లు, జిల్లాలోని 380 పంచాయతీల్లో అటవీ శాఖ, ఉద్యానవన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు.

వంద శాతం లక్ష్యం సాధిస్తాం

-రఘువరన్, డీఆర్‌డీవో



జిల్లాలో వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాన్ని వంద సాధించేలా ముందుకు వెళ్తున్నాం. ఇందుకు అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. పంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా లక్ష్యం నిర్ణ యించుకున్నాం. అన్ని వర్గాల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

మల్లాపూర్, మే, 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్ నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అద్భుతమైన విజయాన్ని సాధిస్తుందని జోస్యం చెప్పారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. 18నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంధిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి సరోజన, ఆదిరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ గైరు నగేష్, దేవ మల్లయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

-కలెక్టర్‌కు మాజీ సర్పంచ్‌ల వినతి



బకాయి వివరాలను చూపుతున్న మాజీ సర్పంచ్‌లు

జగిత్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు సోమవారం వెల్గటూర్, ఎండపల్లి మండలాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తాము పనులు చేసి మూడు సంవత్సరాలు దాటుతున్నా ఇప్పటికీ బిల్లులు ఇవ్వడం లేదని వాపోయారు. అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేశామని అయినా ప్రభుత్వం తమకు బిల్లులు చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జిల్లాకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు 83 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. వాటిని మూడు సంవత్సరాల క్రితం పనులు చేసిన తమకు కాకుండా కొత్త సర్కార్ వచ్చిన తర్వాత చేసిన పనులకు చెల్లిస్తామనడం దారుణమన్నారు. తాము చేసిన అప్పులకు వడ్డీ పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా పెండింగ్ ఉన్న బిల్లులు ముందు చెల్లించిన తర్వాతనే ఇటీవల పనులు చేసిన వారికి బిల్లులు ఇవ్వాలని మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'ఎరువుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు'

జగిత్యాల, మే26 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో విత్తన, ఎరువుల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో కచ్చితంగా బిల్లు తీసుకోవాలన్నారు. విత్తనాల అమ్మకం ధర ఎమ్మార్పీ కంటే ఎక్కువ ఉండకూడదని తెలిపారు. విత్తనాల గడువు తేదీని తప్పకుండా పరిశీలించాలని, లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మకూడదని ఆదేశించారు. బీటీ-3 కాటన్ విత్తనాలు, లూస్ విత్తనాలు, నకిలీ విత్తనాలు మరియు గడువు తీరిన విత్తనాల అమ్మకాలు పూర్తిగా నిషిద్ధమన్నారు.

విత్తన డీలర్లు కచ్చితంగా రికార్డులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో విత్తన టాస్క్‌ఫోర్స్ ఉంటుందన్నారు. టాస్క్‌ఫోర్స్ టీంలో మండల వ్యవసాయ అధికారితో పాటు సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీసు సభ్యులుగా ఉంటారన్నారు. ఈ టాస్క్‌ఫోర్స్ టీంలు అన్ని విత్తన విక్రయ కేంద్రాలను తనిఖీ చేస్తాయని తెలిపారు. ఎరువులను కేవలం ఈ పాస్ ద్వారానే అమ్మాలన్నారు. ఈ పాస్ డేటా మరియు గ్రౌండ్ బ్యాలెన్స్ సరియైనవిగా ఉండాలన్నారు. యూరియా పంపిణీ కేవలం రైతుల ఆధార్ కార్డ్ ఆధారంగా చేయాలని సూచించారు. విత్తనాలు, ఎరువులపై ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా వ్యవసాయ అధికారిని సంప్రదించాలిని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు, విత్తనాలు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- సరిపడా రవాణా వాహనాలు, హమాలీలను అందుబాటులో ఉంచాలి
- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కలెక్టర్ ఆదేశం



సోమన్‌పల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి కొనుగోలు సెంటర్ ను సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబోసి మాయిశ్చర్ రాగానే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. లారీల కొరత లేకుండా చూడాలన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెంటర్ ఇన్‌ఛార్జిలు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, డీఎం జితేంద్రప్రసాద్, రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే ఆరబోయాలి

ధర్మపురి, మే 26 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని తక్షణమే ఆరబోయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. ధాన్యం కొనుగోలు చేసి వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబోసి మ్యాచర్ వచ్చిన వెంటనే వేగవంతంగా కొనుగోలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని ప్రతి రోజు వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఆయన అన్నారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు డాటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హమాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీసీవో మనోజ్‌కుమార్, డీఎం జితేంద్రప్రసాద్, ధర్మపురి ఇంఛార్జ్ తహసీల్దార్ సుమన్, జైనా పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేష్, సీఈవో బలుమూరి సాగర్‌రావు, ఎఫ్ఐ రాజేంద్రప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, మాజీ సర్పంచ్ కురిక్యాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మెట్‌పల్లి రూరల్, మే26 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని పెద్దపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన అతిధి ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకాలకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సోమవారం ప్రిన్సిపాల్ మాధవీలత ఓప్రకటనలో పేర్కొన్నారు. 2025-26విద్య సంవత్సరమునకు 5వతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధించుకుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పీజీటీలో సంస్కృతం-1, తెలుగు-2, గణితం-1, బయాలజీ-1, సోషల్-1, టీజీటీలో గణితం-1, సాంఘిక శాస్త్రం-1, జేఎల్‌లో గణితం-1, ఫిజిక్స్-1, రసాయన శాస్త్రం-1, బోటనీ-1, జువాలజీ-1 సబ్జెక్టు లను ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు పీజీ, బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. కనీసం 55శాతం మార్కులు కలిగి అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకోసం 9866559700నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'రైతు సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు'




మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

రాయికల్, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి అన్నారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడవద్దని ఆయన సూచించారు. మండలంలోని బోర్నపెల్లి గ్రామంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. తూకం వేసి లారీలు తెప్పించి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొడిపెల్లి అంజనేయులు, యూత్ మండల అధ్యక్షుడు ఏలేటి జలంధర్ రెడ్డి, మండ రమేష్, గంగారెడ్డి, తలారి నాగమణి, రాజేష్, కొయ్యడి మహిపాల్ రెడ్డి, ఉప్పు లక్ష్మణ్, సత్యం, జలపతి రెడ్డి, పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

మండలంలోని బోర్నపెల్లికి చెందిన కొడిపెల్లి స్వప్నకు మంజూరైన రూ.1.50 లక్షలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అందజేశారు.

జూనియర్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ చెల్లించాలి



జిల్లా అధికారి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న లెక్చరర్లు

జగిత్యాల అగ్రికల్చర్, మే 26(ఆంధ్రజ్యోతి): ఇంక్రిమెంట్‌ను ఇప్పించాలని కోరుతూ తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్-711 యూనియన్ ఆధ్వర్యంలో జూనియర్ లెక్చరర్లు సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్య దర్శులు నర్సయ్య, తిరుపతిలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 138మంది లెక్చరర్ల వార్షిక ఇంక్రిమెంట్‌ను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు అకారణంగా నిలిపివేశారని ఆరోపించారు. మల్లాపూర్, జగిత్యాల గర్ల్స్ కళాశాల ప్రిన్సిపాల్స్ మాత్రమే ఇంక్రిమెంట్ చేసి శాలరీ బిల్లులు సబ్మిట్ చేశారన్నారు. మిగతా 13 కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్ మాత్రం తమకు రావాల్సిన ఇంక్రిమెంట్‌లను నిలుపుదల చేసి, వేతన బిల్లులు సబ్మిట్ చేయడం శోచనీయం అన్నారు. ఇంటర్మీడియేట్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వీలైనంత త్వరగా తమకు రావాల్సిన ఇంక్రిమెంట్‌ను ఇప్పించాలని వారు కోరారు. స్పందించిన ఇంటర్మీడియేట్ విద్యాధికారి నారాయణ బోర్డు కార్యదర్శి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జూనియర్ లెక్చరర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు విజేందర్‌రావు, తిరుపతి, రాంప్రసాద్ తదితరులున్నారు.

రామగుండం సీపీ పేరుతో సోషల్ మీడియాలో నకిలీ అకౌంట్లు

కోల్‌సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులపేర సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్, వాట్సాప్‌ల్లో వారి ఫొటోలను వాడి నకిలీ అకౌంట్లు క్రియేట్ చేశారు. ఈ ప్రాంతంలోని పలువురు ప్రముఖులకు ఫ్రెండ్స్ రెక్వెస్ట్‌లను పంపిస్తున్నారు. దీంతో ఉన్నతాధికారుల అకౌంట్ కదా అని అక్సెప్ట్ చేస్తే సదరు అధికారి పేర చాటింగ్ చేస్తు న్నారు. ఫలానా అధికారి బంధువులు, మిత్రులు ఆర్మీలో అధికారులుగా పనిచేస్తు న్నారని, వారు బదిలీకావడం వల్ల తక్కువ ధరకు సామగ్రి అమ్ముతున్నారని, కొనుక్కోవాలని, డబ్బులు పంపాలంటూ సూచిస్తున్నారు. అలాగే పుట్టిన రోజు సందర్భంగా బహుమతులు పంపించే విధంగా చాట్‌చేయడం, పోలీస్ అధికారులే చాట్ చేస్తున్నట్టు నమ్మిస్తున్నారు. దీనిపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా స్పందించారు. ఇలాంటి వాటిపట్ల స్పందించవద్దని, డబ్బులు పంపవద్దని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు రోజురోజుకు పేట్రేగిపోతున్నారని, గతంలో సామాన్యులనే లక్ష్యంగా చేసుకున్న నేరగాళ్లు ఇప్పుడు, ప్రముఖులు, పోలీస్ అధికారుల పేర నకిలీఅకౌంట్లు తెరిచివారే చాట్‌చేస్తున్నట్టు నమ్మిస్తున్నారన్నారు. నానారకాలుగా చాటింగ్ చేస్తున్నారన్నారు. పోలీసులెవరూ ఫ్రెండ్స్ రెక్వెస్ట్‌లు పంపరని, అక్సెప్ట్‌లు చేయరని పేర్కొన్నారు.

గుంటిమడుగు ఎత్తిపోతలకు మోక్షమెప్పుడు?

- మానేరు, హుస్సేన్‌మియావాగు కలిసేచోట ప్రతిపాదన
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు

కాల్వశ్రీరాంపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల రైతులు ప్రధానంగా ఎస్సారెస్పీ నీటిపై ఆధారపడతారు. ఈ ప్రాంతానికి ఎస్సారెస్పీ చివరి భూములు కావడంతో సాగునీటి సరఫరా సక్ర మంగా జరగడం లేదు. దీంతో వేసవిలో సాగు నీటి కోసం అన్నదాతలు నానాతంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు మానేరు, హుస్సేన్‌మియావాగు కలిసే చోట పెద్దరాతుపల్లి శివారు గుంటి మడుగు ప్రాంతంలో ప్రాజెక్ట్ నిర్మించాలని బీఆర్ ఎస్ హయాంలో ప్రతిపాదించారు. గంగారం గ్రామపరిధి ఊషన్నపల్లెకు చెందిన ఐడీసీ మాజీ చైర్మన్‌గా ఉన్న ఈద శంకర్‌రెడ్డి అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి రైతుల సమస్యలు తీసుకెళ్లారు. కేసీఆర్ హామీతో 2019లో గుంటిమడుగు ఎత్తిపోతల పథకానికి సర్వే కూడా చేయించారు. అప్పటి కలెక్టర్ అలుగు వర్షిణి ప్రాజెక్టు ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకొని గంటి మడుగు ఎత్తిపోతల పథకం అవసరమని కలెక్టర్ ధ్రువీకరించారు. సుమారు 450కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేశారు. రిజర్వాయర్‌తోపాటు మానేరులో కిష్టం పేట వరకు, హుస్సేన్‌మియావాగు చుట్టూ కాల్వశ్రీరాంపూర్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర కరకట్టలు నిర్మించి సాగునీటిని నిల్వచేసేందుకు ప్రణాళిక రూపొందించారు. దీంతో మానేరు, హుస్సేన్ మియా వాగులో సుమారు నాలుగు కిలో మీటర్ల మేర నీరు నిల్వ ఉండి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని, నిల్వ ఉన్న నీటిని మంథని ప్రాంత రైతాంగానికి కూడా ఇచ్చేందుకు ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. సుమారు 50వేల ఎకరాలకు రెండు కాలాల పంటలకు సాగునీరు అందుతుందని అంచనా వేశారు. ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి సుమారు కోటిరూపాయల నిధులతో వ్యాప్కో కంపనీతో సర్వే కూడా చేయించారు. సుమారు మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించేందుకు అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి అందజేశారు.

ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని హుస్సేన్‌మియావాగు, మానేరు ప్రాంత రైతులు ఆశపడ్డారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. గుంటిమడుగు ఎత్తిపోతల పథకం వలన భూపాలపెల్లి జిల్లా టేకుమట్ల మండలం మానేరు పరివాహక ప్రాంత గ్రామాలతో పాటు, మండలంలోని పెద్దరాత్‌పల్లి, కాల్వ శ్రీరాంపూర్, చిన్నరాత్‌పల్లి, మోట్లపల్లి, కిష్టం పేట, మీర్జంపేటతోపాటు ముత్తారం మండలం లోని పలు గ్రామాల రైతులకు ప్రాజెక్టు ఉపయోగకరంగా ఉంటుంది. వేసవిలో హుస్సేనిమియా వాగులో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు ఎండిపోతుంటాయి. దీంతో సాగునీరు అందక పంటలను పశువుల మేతకు ఉపయోగించిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఎస్సారెస్పీ కాలువలపై ఆధారపడకుండా గుంటిమడుగు వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.


ప్రాజెక్టు నిర్మించే గుంటిమడుగు ప్రాంతం

రెండు పంటలకు సాగునీరు

రైతు రావిసెట్టి సారయ్య(పెద్దరాత్‌పల్లి)



గుంటిమడుగు ఎత్తిపోతల పథకం వలన రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రెండు పంటలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం సాగు నీరు అందక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నాం

రైతు కారుపాకలక్ష్మణ్(కాల్వశ్రీరాంపూర్)



ఎస్సారెస్పీ కాలువ చివరి ప్రాంతంలో భూములు ఉండడం వలన సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నాం. గుంటిమడుగు రిజర్వాయర్‌తో ఈ ప్రాంత భూములు సస్యశ్యామలవుతాయి. వేసవి వచ్చిందంటే సాగునీరు అందక అనేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి ప్రాజెక్టు నిర్మించాలి

భూ కబ్జా బెదిరింపులపై సీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలం సుందరగిరిలో రమేష్ అనేవ్యక్తి తనభూమి కబ్జా చేసేందుకు బెదిరిస్తున్నాడని అదే గ్రామానికి శ్రీమూర్తి రాజు సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశాడు. రమేష్ బెదిరింపులతో తమ కుటుంబం భయాందోళనకు గురవుతున్నదని, అతడితో ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. రమేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరాడు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

రామగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మంథని మండలం సిద్దపల్లి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మట్టికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పాటు డ్రైవర్లను విచారించగా కల్వచర్లకు చెందిన టిప్పర్ యజమాని ఆదేశాల మేరకు మంథని మండలం గుంజపడుగులోని సరస్వతి పంప్‌హౌజ్ దగ్గర నుంచి రాఘవపూర్‌లోని ఇటిక బట్టీలకు తరలిస్తున్నామని తెలిపారన్నారు. ఇద్దరు డ్రైవర్‌లను అదుపులోకి తీసుకొని యజమాని, డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూ వివాదంలో మహిళా రైతు దారుణ హత్య

చందుర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు మల్లవ్వ (60) అనేమహిళా రైతు సోమవారం సాయంత్రం హత్యకు గురైంది. మృతురాలి కుటుంబసభ్యులు, గ్రామస్తులు, పోలీసులకథనంప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు మల్లవ్వ, బొల్లు మనోజ్ అనే యువకుడి మధ్య కొన్నిసంవత్సరాలుగా భూ వివాదం నడుస్తోంది. ఈ విషయంలో పలు మార్లు పంచాయతీలు జరిగాయి. మల్లవ్వ తనకు ప్రాణభయం ఉందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదుచేశారు. మల్లవ్వ సోమవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా మనోజ్ కత్తితో మల్లవ్వను హత్యచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటుదూరంలో పెద్దమ్మ ఆలయంవద్ద మల్లవ్వను అత్యంత దారుణంగా హత్యచేశాడు. అనంతరం హంతకుడు మనోజ్ కత్తితో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సమాచారం తెలుసుకున్న చందుర్తి ఎస్‌ఐ అంజయ్య సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త రాజయ్య ఉన్నాడు. కుమారుడు రాజు గల్ఫ్‌లో ఉండగా, ఒక కూతురు ఉన్నారు. మల్లవ్వ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.


మల్లవ్వ (ఫైల్)

● కుటుంబ సభ్యుల రాస్తారోకో

మల్లవ్వ మృతదేహాన్ని తమకు తెలియకుండా పోలీసులు పోస్టుమార్టంకు పంపించారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. చందుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో కోరుట్ల-వేములవాడ ప్రధానరహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. తమకు న్యాయంచేయాలని నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. న్యాయంచేస్తామని హామీ ఇవ్వడంతో రాత్రి ధర్నాను విరమించారు.

పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు

బొల్లు మల్లవ్వను హత్య చేసింది తానేనని చందుర్తి గ్రామానికి చెందిన యువకుడు బొల్లు మనోజ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. కత్తిని పోలీసుల ఎదుట ఉంచి, మహిళ తల తీసివేసినట్టు, పెద్దమ్మ గుడి వద్ద హత్య చేసినట్టు పోలీసులకు చెప్పాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇదిలా ఉండగా మనోజ్ గతంలో ఒక వ్యక్తిని చందుర్తి గ్రామంలో వినాయక చవితి రోజున హత్య చేశాడు. ఆ సమయంలో మైనర్‌గా ఉండడంతో పోలీసులు జువైనల్ జైలుకు తరలించారు. ఆ కేసులో జైలు జీవితం గడిపి బెయిల్‌పై విడుదలై వచ్చాడు. ఈ ఘటన ఒక్కసారిగా మండలంలో కలకలం సృష్టించింది.

డిగ్రీ పరీక్షల్లో 16 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీ క్షల్లో మాల్‌ప్రాక్టీస్ చేసిన 16మంది విద్యా ర్థులను సోమవారం డీబార్ చేసినట్లు విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. కరీంనగర్ శ్రీచైతన్యడిగ్రీకళాశాల కేంద్రంలో ఇద్దరు, వాణినికేతన్‌లో ఒకరు, అపూర్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, అల్ఫోర్స్(మహిళా) డిగ్రీ కళాశాలలో ఒకరు, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శివానీ డిగ్రీకళాశాలలో ఇద్దరు, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, మహర్షి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇద్దరు, గంభీ రావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ అప్పులకు యువకుడు బలి

మానకొండూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ అప్పులకు ఓ యువకుడు బలి అయ్యాడు. సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన పప్పు ఆంజనేయులు(25) లోన్ ఆప్‌లో ఒక లక్ష అప్పు చేశాడు. వడ్డీతో పాటు రెండు లక్షల లోన్ చెల్లించాడు. అయినా మరో రెండు లక్షల రూపాయలు చెల్లించాలని యాప్ నిర్వాహకులు వేధింపులకు గురిచేసినట్లు తెలిపారు. అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఆదివారం గ్రామంలోని గుట్టవద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు చేరాల ప్రసన్నకుమార్ (27) హైదరాబాదులో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపినవివరాల ప్రకారం... తంగళ్లపల్లికి చెందిన చేరాల రాజేశం- సుగుణ దంపతుల కుమారుడు ప్రసన్న కుమార్ బీ ఫార్మసీ పూర్తిచేసుకుని హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ప్రభుత్వం ఫార్మసిస్ట్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయగా ప్రసన్నకుమార్ పరీక్ష రాశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఆందోళనకు లోనయ్యాడు. అలాగే గతంలో కూడా పలు ఉద్యోగాలకు పోటీ పరీక్షలు రాసినప్పటికీ ఎంపిక కాకపోవడంతో మానసిక వేదనకు గురయ్యాడని బంధువులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులోని కోఠిలో మరో నలుగురితో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఉదయం బాత్‌రూంలో ఉరివేసుకొని ప్రసన్నకుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన మిత్రులు ఉద్యోగాలకు ఎంపికవుతుండగా తనకు మాత్రం ఉద్యోగం రావడంలేదని ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.


ప్రసన్నకుమార్ (ఫైల్)

మొలకెత్తిన ధాన్యంతో రైతుల నిరసన

చందుర్తి మే 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మం డల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలుక పెంటయ్య అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో మొలకెత్తిన ధాన్యంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చందుర్తి రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా పెంటయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయని, వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాకులను పలుమార్లు కోరినప్పటికీ నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మార్త వెంకవ్వ, సతీష్, తిరుపతి, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మొలకెత్తిన ధాన్యంతో నిరసన తెలుపుతున్న రైతులు

చికిత్స పొందుతూ కాంగ్రెస్ నాయకుడు మృతి

గన్నేరువరం, మే 26 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతూ అదుపుతప్పి కిందపడగా తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మండలవర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవిందర్(51) సోమవారం మృతి చెందాడు. ఈ నెల 17న రవిందర్ బైక్‌పై వేములవాడకు బయలుదేరగా కొదురుపాక, నాంపల్లి మధ్యలో అదుపుతప్పిన బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో పక్కటెములు విరిగి తలకు తీవ్రంగా గాయాలు కాగా స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడనుంచి మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం రవిందర్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


రవిందర్(ఫైల్)

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

వీణవంక, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో సోమవారం గొల్ల, కురుమలు, మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుళ్లనడుమ ఆలయానికి తరలివచ్చి స్వామివారికి మొక్కులుచెల్లించుకున్నారు. అనంతరం కామరతి, బీరప్ప కల్యాణోత్సవం కన్నుల పండువగ చేశారు.


బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

కారు బోల్తా: ముగ్గురికి స్వల్ప గాయాలు

పెద్దపల్లి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలకు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో పెద్దకల్వల శివారువద్ద మూడుకార్లు ఒక దానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలు కాగా పెద్దపల్లిఆసుపత్రికి తరలిం చారు. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం కరీంన గర్‌కు చెందిన కుటుంబ సభ్యులు కాళేశ్వరం సరస్వతి పుష్కరస్నానాలకు వెళ్లి తిరిగి వెళ్తున్న క్రమంలో పెద్దక ల్వల శివారులోని రాజీవ్‌రహదారికి ఆనుకొని ఉన్న మహబూబ గార్డెన్ ఎదుట మూడు కార్లు ఢీకొన్నాయి. కరీంనగర్ చెందినవారి కారు బోల్తాపడింది. గాయా లైనవారిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


బోల్తా పడ్డ కారు

మాచారెడ్డిలో రోడ్డు ప్రమాదం

● రాజన్నపేట మహిళ దుర్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామ శివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన మహిళ చొక్కి సులోచన(28) అక్కడికక్కడే దుర్మరణం పాలైందని స్థానికులు, కుటుంబసభ్యులు సోమవారం తెలిపారు. ఆమె పిల్లలు అఖిలేష్, శివాన్స్‌లు తీవ్ర గాయాలకు గురయ్యారు. తల్లి మృతి చెందడం, ఇద్దరు పిల్లలు తీవ్రగాయాలపాలడంతో స్థానికంగా విషాదం నెలకొంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని సులోచన భర్త మహేందర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. ఉదయం ఆమె తన పిల్లలను తీసుకుని మాచారెడ్డి మండలం లచ్చపేటకు బస్సులో బయలుదేరింది. మాచారెడ్డిలో దిగిన ఆమె తన తండ్రికి ఫోన్ చేసి తీసుకెళ్లాలని పేర్కొంది. తండ్రి టీవీఎస్ ఎక్సల్‌పై చేరుకుని సులోచన, ఇద్దరు పిల్లలు అఖిలేష్, శివాన్స్‌లతో కలిసి లచ్చపేటకు వెళుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన బైక్ అతివేగంగా ఢీకొట్టింది. దాంతో సులోచన అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్ర గాయాలపాలైన పిల్లలను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తాజామాజీసర్పంచ్ శంకర్, కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పుట్టింటికి వెళుతున్నానని బయలుదేరిన మహిళ సులోచన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

భక్తులతో కిక్కిరిసిన రాజన్నక్షేత్రం

● రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు ● దర్శనానికి నాలుగు గంటల సమయం


భక్తులతో పోటెత్తిన రాజన్న ఆలయ ప్రాంగణం


ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేసవి సెలవుల సందర్భంగా రాజన్న ఆలయం భక్తులతో రద్దీగా ఉంటోంది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు శనివారం రాత్రి ఆలయా నికి చేరుకుని ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా నాలుగు గంటలు క్యూలైన్‌లో బారులుతీరారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకోగా భక్తుల రద్దీ దృష్ట్యా బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లు నిరంతరంగా కొనసాగించారు. భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని తరించారు. భీమేశ్వర, నగరేశ్వర శ్రీబద్దిపోచమ్మ ఆలయాలను సందర్శించి తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం రోజున రాజన్న ఆలయానికి 80నుంచి 90వేల వరకు భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

● భక్తుల ఇబ్బందులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల వద్ద కొందరు డబ్బులు దండుకునే యత్నం చేస్తున్నారు. బెల్లం దుకాణాల వద్ద కాంటాల్లో వ్యత్యాసం వస్తుందని భక్తులు సదరు కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. బెల్లం రాజన్న ఆలయ పేరుతో ముద్రించిన టికెట్ ఇస్తూ భక్తుల వద్ద అందినకాడికి దండుకుంటు న్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

అంతేకాకుండా కొబ్బరికాయ కొట్టిన చోట ఒక్కో కొబ్బరికాయకు రూ.10వసూలు చేస్తున్నారు. కొబ్బరి కాయలు కొట్టే కాంట్రాక్టర్ సదరు సిబ్బందికి వేతనం ఇవ్వకుండా భక్తుల వద్ద తీసుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. దీనిపై భక్తులు ఆలయాధికారులపై తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఈవోతోపాటుగా సంబంధిత ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షించి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాల అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణనగర్‌లో ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఏడుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వారివద్ద నగదుతో పాటు ఏడుసెల్‌ఫోన్లు పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో కానిస్టేబుళ్లు కమలాకర్, అఫ్రోజ్, ఖాసీం తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

మానకొండూర్‌లో ఐదుగురు..

మానకొండూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగురుపల్లి గ్రామంలో సోమవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,460 నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీఐ గోపతి నరేందర్ తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కళ్యాణ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు రూ.25వేల పెన్షన్, 250చదరపు గజాల ఇంటి స్థలాన్ని ఇస్తానని చెప్పి ఇప్పటివరకు అమలు కాలేదని, ఉద్యమకారులకు బస్‌పాస్, గుర్తింపు కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. అనుముల కళావతి, జనగామ స్వామి, దాసరి ఎల్లయ్య, బత్తుల శంకర్, సీత, లలిత, మొగిలి, రాములు పాల్గొన్నారు.


చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు

జాతీయస్థాయి షూటింగ్ పోటీల్లో రాణించిన మేఘన

● అభినందించిన పోలీస్ కమిషనర్



మేఘనను అభినందిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పిస్టల్ షూటింగ్ పోటీల్లో రామగుండానికి చెందిన మేఘన రాణించింది. ఏసీపీ సాదుల సారం గపాణి కుమార్తె మేఘన పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించింది. సోమవారం రామ గుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆమె సన్మానించారు. పెద్దపల్లి ఏసీపీగా విధులు నిర్వహించిన సారంగపాణి ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ అకాడమీలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కుమార్తె మేఘన కొన్ని సంవత్సరాలుగా షూటింగ్‌లో రాణిస్తోంది. ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్-2023 జర్మనీలో జరుగగా బంగారుపతకం, ఆసియా చాంపియన్‌షిప్-2023లో వెండిపతకం, ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్- 2023లో దేశానికి ప్రాతినిధ్యం వహించారు. మూడు అంతర్జా తీయ చాంపియన్ షిప్ పత కాలు, బహుళ తెలంగాణ రాష్ట్ర చాంపియన్‌షిప్ పతకాలతో పాటు వ్యక్తిగత కాంస్య, ఆల్ ఇండియా పిస్టల్ షూటింగ్ పోటీల్లో రాణించారు. విలువిద్య లో సైతం జాతీయ స్థాయిలో సత్తాచాటారు. సీపీ మాట్లా డుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడల్లోఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహిం చాలని, ముఖ్యంగా నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమయ్యే పోలీసులు పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు సహకారం అందించడం సంతోషదాయమకమన్నారు. మేఘన అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

ముగిసిన సరస్వతి పుష్కరాలు



సరస్వతి విగ్రహం వద్ద మంత్రి శ్రీధర్‌బాబు, తదితరులు



కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



శివుని ప్రతిమ వద్ద భక్తుల కోలాహలం



హారతిని తిలకిస్తున్న భక్తులు



హారతినిస్తున్న కాశీ పండితులు



- చివరి రోజు 2.25 లక్షల మంది పుణ్యస్నానాలు
- మొత్తంగా 15.90 లక్షల మంది భక్తుల రాక

భూపాలపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలు సోమవారంతో ముగిశాయి. భూపాల పల్లి జిల్లా కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రోజూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పుష్కరాలను విజ యవంతం చేసింది. చిన్నచిన్న అవాంతరాలు మినహా యిస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసు కోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పుష్కరాల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పా ట్లను ఘనంగా చేసింది. ఈ పుష్కరాలకు 15.9 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. చివరి మూడు రోజుల్లోనే సుమారు ఎనిమిది లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల్లో చివరి రోజైన సోమవారం 2.25 లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

● ట్రాఫిక్ సమస్యలు

పుష్కరాలకు ఆరు లక్షల నుంచి ఎనిమిది లక్షల మంది వస్తారని అంచనా వేయగా ఎవరూ ఊహిం చని రీతిలో సంఖ్య 16 లక్షలకు చేరుకోవడంతో అధి కారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భక్తుల సంఖ్య ఊహించని రీతిలో ఉండడంతో సదుపాయలకు సంబంధించి అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సరిగ్గా లేకపోవడంతో పుణ్య స్నానాల కోసం వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు.

● వైభవంగా త్రివేణిసంగమ నవరత్నమాల హారతి

కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీపుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి ఏడు నుంచి 7.45గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హారతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పుష్కరాలు విజయవంతం కావడం, 12రోజుల పాటు ప్రజలందరికీ శ్రేయస్సును, శుభాన్ని కల్గించాలని నదీమాతకు నవరత్నమాలహారతి సమర్పించడం ఆనందకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి వికాసరాజ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మదన్‌మోహన్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ పాల్గొన్నారు.





పదేళ్లలో దోచుకున్న ప్రతీ రూపాయి కక్కిస్తాం

● కాంగ్రెస్ నాయకుడు, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్లపాలనలో దోచుకున్న ప్రతీ రూపాయిని రాష్ట్రప్రభుత్వం కక్కిస్తుందని కాంగ్రెస్‌సీనియర్ నాయకుడు, కుల సంఘాల జేఏసీచైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. సోమ వారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేక రుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు అవి నీతిపై విచారణ పూర్తికావచ్చిందని, కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. ఆ భయంతోనే సీఎం రేవంత్ రెడ్డిపైనా, కాంగ్రెస్ ప్రభుత్వంపైనా మాజీమంత్రి కేటీఆర్ అడ్డగోలు వ్యాఖ్యలు చేశారన్నారు. తెలంగాణ బీఆర్ఎస్‌ది కాదని, 4కోట్ల తెలంగాణ ప్రజల దని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం రూ.70వేల కోట్ల నుంచి రూ.లక్షా50వేల కోట్లకు పెంచుకున్నారని, రూ.80వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో ఇసుకదోపిడీలో కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు భాగస్వాము లయ్యారని ఆరోపించారు. 2014కు ముందు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఆస్తులు సాధా రణ స్థితిలో ఉంటే ఇప్పుడు వేలకోట్లకు చేరాయన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు విదేశాల్లో పెట్టుబడులు పెట్టారని, అవి తెలంగాణాను దోచుకున్న డబ్బులేనని అన్నారు. ఆస్తుల విషయం లోనే ఎమ్మెల్సీ కవితకు కేటీఆర్‌కు మధ్య గొడవలు తలెత్తాయన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రజలను, ఉద్యమ కారులను మోసం చేశారని, చివరకు ఆడ బిడ్డ కవితను కూడా ఇంటినుంచి బయటకు గెంటేస్తున్నారని అన్నారు. తండ్రీకొడుకుల వ్యవహారంతో బీఆర్ఎస్ మూడు ముక్కలవు తుందని, హరీశ్‌రావు బీజేపీలోకి వెళ్తారని అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం

విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాదబీమా

● దేశచరిత్రలోనే రికార్డు

● డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ప్రమాదబీమా చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కరీంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): విద్యుత్ కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని కరీంనగర్ సర్కిల్ చెంజర్ల సెక్షన్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ భార్య సుష్మకు సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కు, కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుడికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వమూ ఇంత గొప్పగా ఆలోచన చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాకే సాధ్యమైందని అన్నారు. ప్రమాద బీమాతోపాటు, కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు అద్దం పడుతుందన్నారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అంది ంచాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, బ్యాంకు ఉన్నతాధికారులు సర్వేశ్ రంజన్, కె.భాస్కర్ రావు, డి.అపర్ణ రెడ్డి, కరీంనగర్ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు, డీఈ తిరుపతి, ఏఈ రమేష్, లక్ష్మణమూర్తి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

● ప్రమాదకరంగా గుంతలు ● వాహనదారుల ఇబ్బందులు



వల్లంపహాడ్ బ్రిడ్జి వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు



నగునూర్ మూల మలుపు వద్ద గుంతలు పడిన రోడ్డు

కరీంనగర్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి లక్సెట్టిపేటకు వెళ్లే మార్గంలో నగర శివారులోని వల్లంపహాడ్ బ్రిడ్జి సమీ పంలో రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనాదారులు రాకపోక పోలకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు కరీంనగర్ నుంచి మంచిర్యాల, ఆసిఫాబాద్ వైపు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటితోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రహదారి వెంట కరీంనగర్‌కు వచ్చి వెళ్తుంటారు. వల్లంప హాడ్ బ్రిడ్జిపైనా, నగునూర్ నుంచి నుంచి కరీంనగర్‌కు వచ్చే రహదారి మూల మలుపు వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వర్షం కురిసి గుంతల్లో నీరు నిలవడంతో వేగంగా వచ్చే వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మూడు రోజుల కిందట ఈ గుంతల్లో నీరు నిలిచి మూడు ప్రమాదాలు సంభవించాయి. రాత్రి వేళ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వల్లంపహాడ్ బ్రిడ్జిపై గుంతలతోపాటు, మూల మలుపుల వద్ద గుంతలకు మరమ్మతు చేపట్టాలని కోరుతన్నారు.

విద్యుత్ కోసం గేదెలతో రోడ్డుపై నిరసన



రోడ్డుపైన అడ్డంగా గేదెలను కట్టేసి నిరసన తెలుపుతున్న బాధితులు

గన్నేరువరం, మే 26 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా వ్యవసాయబావికి విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో పశువులు నీళ్ల లేక అల్లాడుతున్నాయని కరీంనగర్‌జిల్లా గన్నేరువరం మండలం లోని గునుకుల కొండాపూర్‌కు చెందిన రైతు కొరివి పోచయ్య-సుశీల దంపతులు తమ గేదెలతో రోడ్డుపైన బైఠాయించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గును కుల కొండాపూర్ నుంచి గుండ్లపల్లికి వెళ్ళే ప్రధాన రహదారిపై నెల రోజులు క్రితం ఓ లారీ తగిలి విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయన్నారు. విద్యుత్ అధికారులు అక్కడికి వైర్లను తొలగించారని, అప్పటినుండి తన వ్యవసాయ బావికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. విద్యుత్ నిలిచిపోవడంతో మోటర్ నడవడం లేదని, పశువులకు నీళ్ల పెట్టడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులకు తెలిపినా నిర్లక్ష్యం పట్టించుకోలేదన్నారు. దీంతో రోడ్డుపై గేదెలతో నిరసనకు దిగినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు అక్కడికి వచ్చి రైతు దంపతులకు నచ్చజెప్పి గేదెలను తీసివే యించారు. అనంతరం వారి బావికి విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ



యమధర్మరాజుకు హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ధర్మపురి, మే 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలా డాయి. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్థానిక శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి బిల్వార్చన చేశారు. స్వామివారలకు ఆలయవేద పండి తులు బొజ్జ రమేష్‌శర్మ నిత్యపూజలు, అభిషే కాది కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీ నర సింహస్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర దేవాదాయ మాజీ కమిషనర్ పూజలు

లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మాజీకమిషనర్ సుందర్‌కుమార్ కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించారు. ఆలయం వద్ద వారికి వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారందరు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లక్ష్మీ నరసింహస్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

అప్పు తీసుకోకున్నా చెల్లించాలని వేధింపులు

-కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): తాము అప్పు తీసుకోకపోయినా అప్పు చెల్లించాలంటూ తమను ప్రైవేటు ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు వేధింపులకు గురి చేస్తున్నారని జగిత్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన పలువురు బాధితులు సోమవారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అప్పు తీసుకున్న వారితో తమకు సంబంధం లేకున్నా బజాజ్ ఫైనాన్స్, క్రెడీ్ కంపెనీల పేరుతో పలువురు వ్యక్తులు తమకు ఫోన్ చేసి అప్పు చెల్లించాలని వేధిస్తున్నారని వాపోయారు. మాకు సంబంధం లేని వ్యక్తులకు అప్పులు ఇచ్చి అవి చెల్లించాలని దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

జగిత్యాల అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ అన్నారు. జగిత్యాల పట్టణంలో శ్రీ రామచంద్ర మిషన్, మరియు హార్ట్‌ఫుల్ నెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రైటర్ మైండ్స్ కార్యక్రమం జరిగింది పట్టణంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మానసికంగా ధృడంగా ఉండేలా శిక్షణ ఇచ్చినట్లు మాస్టర్ ట్రైనర్ పాలాకుల వెంకటేశ్ తెలిపారు. పదిరోజుల శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పది రోజులుగా నేర్చుకున్న విషయాలను ప్రదర్శించారు. కళ్ళకు గంతలు కట్టుకుని నడవడం, స్కేటింగ్ చేయడం, కళ్ళకు గంతలు కట్టుకుని రూబిక్ క్యూబ్ సాల్వ్ చేయడం, కళ్ళకు గంతలు కట్టుకుని వాసన, స్పర్శలతో పుస్తకాలు చదవడం లాంటి కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, జిల్లా బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షులు మంచాల కృష్ణ, గంప వేణు, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

-కలెక్టర్ సత్యప్రసాద్ -ప్రజావాణిలో 59 దరఖాస్తులు

జగిత్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణికి సోమవారం జనం బారులు దీరారు. ప్రజావాణిలో 59 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు.


దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మత్స్యకార సొసైటీని ఏర్పాటు చేయాలి

-మత్స్యకార సంఘం ఆలూరు

ఆలూరు గ్రామంలో వంద వరకు మత్స్యకార కుటుంబాలు ఉంటాయి. దశాబ్దాల తరబడి తాము సొసైటీ ఏర్పాటు చేయమంటే అధికారులు సహకరించడం లేదు. గ్రామంలోని అగ్ర కులస్తులు మేము సొసైటీ ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటున్నారు. సొసైటీ ఏర్పాటయితే ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు అందుతాయి. సొసైటీ ఏర్పాటు చేయకపోవడం వల్ల మేము తీవ్రంగా నష్టపోతున్నాము. ఎలాగైనా ఈసారి సొసైటీని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

మురికి కాలువ తవ్వనివ్వడం లేదు

-శివాజినగర్, 15వ వార్డు, జగిత్యాల

మావార్డులో మున్సిపాలిటీ వారు మురికి కాలువ నిర్మిస్తుండగా ఓ వ్యక్తి తన స్థలంలో నుంచి మురికి కాలువ తవ్వనివ్వనని అడ్డుగా రాళ్లు పెట్టాడు. అతడిని చూసి మరికొంత మంది అలాగే పెట్టారు. దాని వల్ల మురికి కాలువ నిర్మాణం నిలిచిపోయింది. దీంతో మురికి నీరు ఇళ్ల ముందు నిలిచి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నది. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుని మురికి కాలువ నిర్మాణం పూర్తి చేయాలి.

భూభారతి అమలులో సర్వేయర్ల పాత్ర కీలకం


శిక్షణలో పాల్గొన్న సర్వేయర్లు

జగిత్యాల అగ్రికల్చర్, మే 26(ఆంధ్రజ్యోతి): భూభారతి అమలులో ల్యాండ్ సర్వేయర్ల పాత్ర కీలకం అని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైసెన్స్ సర్వేయర్‌ల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందన్నారు. సమస్యలు పరిష్కారానికి, భూభారతి చట్టం విజయవంతంగా అమలు చేయడంలో సర్వేయర్ల పాత్ర కీలకం అన్నారు. 50రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి సర్వేయర్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలిరోజు శిక్షణ కార్యక్రమానికి 156మంది ఎంపికవగా 10మంది గైర్హాజరైనట్లు జిల్లా సర్వే ల్యాండ్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. మూడు దరఖాస్తులు తిరస్కరణకు గురవగా శిక్షణకు మొత్తం 143మంది హాజరైనట్లు ఆయన వివరించారు. ఈ శిక్షణ రెండు విడతల్లో ఉంటుందని జిల్లా వ్యాప్తంగా మొత్తం 279 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్ గౌడ్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ విఠల్‌రావుతో పాటు 6గురు శిక్షకులు, 143మంది శిక్షణార్థులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారి

-ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


వరదకాలువ వంతెన దగ్గర ప్రమాదకరంగా గుంత

మల్యాల, మే 26(ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్ రోడ్డు నుంచి మల్యాల మండల కేంద్రంకు వెళ్లె రహదారి అధ్వాన్నంగా మారింది. బ్లాక్ చౌరస్తా వరకు పలు చోట్ల గుంతలు ఏర్పడి ప్రయాణానికి ఆటంకం ఏర్పడుతుంది. గుంతల వద్ద తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో అనేక మంది గాయాల పాలు అయ్యారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ మార్గంలో వెళ్లె ప్రజలు తీవ్ర అసౌకర్యంకు గురి అవుతున్నారు. ఈ రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

క్రీడాప్రాంగణం దుస్థితి చూడరూ..!



క్రీడాప్రాంగణంలో వేసిన గుడిసెలు, సామాగ్రి

మల్యాల, మే 26(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని రాంపూర్ క్రీడాప్రాంగణంలో గుడిసెలు వేయడమే కాకుండా నిర్మాణ సామాగ్రితో నింపివేశారు. దీంతో క్రీడాప్రాంగణం రూపు కోల్పోయింది. క్రీడల కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంను స్క్రాప్ సెంటర్‌గా మార్చడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన దివ్యాంగులకు రుణాలు అందించాలి


మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

కోరుట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన దివ్యాంగులకు రుణాలు అందించాలని దివ్యాంగ నాయకులు సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం దివ్యాంగులు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తులు స్వీకరించి అందరినీ ఇంటర్వ్యూ చేసారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నదన్నారు. ఈ స్వయం ఉపాధి రుణాల మంజూరులో కోరుట్ల పట్టణానికి చెందిన అర్హత గల నిరుద్యోగ దివ్యాంగులకు అవకాశం కల్పించాలని కోరారు.

దివ్యాంగులు స్వయం ఉపాధి పొంది ఆర్థిక అభివృద్ధి చెందే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దివ్యాంగ సంఘ నాయకులు అబ్బుల్ అజీజ్, ఓం ప్రకాష్, వాడ్నాల శ్రీనివాసరావు, నాగరాజు, లంక దాసరి దేవదాస్, సాయిరాం, శేఖర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి సోమవారం అదె గ్రామానికి చెందిన కుంబం శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రమణారెడ్డి అనె అన్నదమ్ములు 25వేల 516రూపాయలను విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అంతె కాకుండ అదె గ్రామానికి చెందిన బక్కశెట్టి శ్రీనివాస్ 5116 రూపాయలను ఆలయ నిర్మాణానికి విరాళంగా అందించారు. విరాళం అందించిన దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

'అర్చకులు సనాతన ధర్మ రక్షకులు'

రాయికల్, మే 26 (ఆంధ్రజ్యోతి): అర్చకులు సనాతన ధర్మ రక్షకులని అహల్యాబాయి జయంత్యుత్సవాల కమిటీ జిల్లా కన్వీనర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం అన్నారు. రాయికల్ మండల కేంద్రంలోని లలితాంబ ఆలయంలో పుణ్యశ్లోక, లోకమాత, రాజ మాత రాణి అహల్యాబాయి హోల్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులను శాలువాలతో సత్కరించారు. రానున్న నూతన విద్యా విధానంలో భారతదేశ వీరుల చరిత్రను పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా చేర్చి భావితరాలకు భారతీయుల గొప్పతనాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఎన్నో దేశాలు కాలగర్భంలో కలిసిపోయినా సనాతన ధర్మం ఇంకా బతికి ఉండి ప్రపంచానికి దిశా నిర్దేశం చూపించే స్థాయిలో ఉందంటే దానికి మూలకారణం అర్చకులేనని, వారి సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ సురతాని భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యులు సాంబారి కళావతి, దురిశెట్టి మమత, రాయికల్ పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భూమేష్, అందె శంకర్, గంగరాజం, అశోక్, అజయ్, శంకర్, లక్ష్మి, గంగాధర్, వెంకటాద్రి, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి'

పెగడపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీవో రఘువరన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ధాన్యం కుప్పల నిల్వలు, తూకం వేసిన ధాన్యం ఎన్ని క్వింటాల్లు నిల్వ ఉన్నాయి తెలుసుకుని, తూకం వేయకుండా నిల్వ ఉన్న సన్నం రకం ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు.


పెగడపల్లిలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో రఘువరన్

సన్న రకం ధాన్యం తూకం వేయించి వెంట వెంటనే మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఏపీఎం సమత, సీసీలు తిరుపతి, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ఎల్లాపూర్‌లో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించిన కోళ్లఫారాన్ని పరిశీలించారు. మండలంలో మరిన్ని షెడ్లు మంజూరు చేసి పథకం ద్వారా మరింత మందికి ఉపాధి కల్పించాలన్నారు.

●పెగడపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాజీవ్‌యువ వికాసం బీసీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు రుణాల మంజూరుకు గాను నిర్వహించిన ఇంటర్వ్యూలను డీఆర్‌డీఓ రఘువరన్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ రఘువరన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు గాను రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులందరిని ఇంటర్వ్యూలు నిర్వహించి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులకు డీఆర్‌డీఓ రఘువరన్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీఎం సమత, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ లేక నిలిచిన చెత్త వాహనాలు


జగిత్యాలలో నిలిచిఉన్న మున్సిపల్ చెత్త వాహనాల

జగిత్యాల అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీకి చెందిన చెత్త వాహనాలు సోమవారం నిలిచి పోయాయి. మున్సిపల్ వాహనాలలో సోమవారం డీజిల్ పోయక పోవడంతో డ్రైవర్‌లు వాహనాలను బయటకు తీయలేదు. దీంతో పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడ ఉండిపోయింది. అసలే నాలుగురోజులు భారీ వర్షాలు కురవగా చెత్త కుప్పలు ఎక్కడివక్కడే ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లింది.

మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంతోనే వాహనాలలో డీజిల్ పోయించకపోవడం వల్ల సోమవారం డ్రైవర్లు వాహనాలు బయటకు తీయలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ముగిసిన రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు

జగిత్యాల అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో సోమవారం రాజీవ్ యువ వికాస్ ఇంటర్వ్యూలకు 3200 మంది హాజరయినట్లు జగిత్యాల మున్సిపాలిటీ కమీషనర్ స్పందన తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆరు వేల మంది దరఖాస్తు చేసుకోగా మొదటి రోజు ఓబీసీలు 970 మంది హాజరు కాగా రెండవ రోజు ఎస్సీ, ఎస్టీలు 580 మంది హాజరయ్యారు. జగిత్యాల మున్సిపలిటీ పరిధిలో మొత్తం 5 వేల 50 మంది ఇంటర్వ్యూలకు హాజరయినట్లు కమీషనర్ తెలిపారు. లీడ్ బ్యాంకు ప్రతినిధులతో పాటు మెప్మా టిఎంసి రజిత తదితరులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుదారులకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్టీ, మైనారిటీ, క్రిస్టియన్,ఇబిసి దరఖాస్తుదారులకు బ్యాంకు మేనేజర్లు, మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ దరఖాస్తుదారులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** రాజీవ్ యువ వికాసం పథకం 2024-25 కింద దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యక్రమంలో నిర్వహించినట్లు ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మూడవ రోజు బీసీ కార్పొరేషన్‌కు 600 మందిని ఇంటర్వ్యూలకు పిలవడం జరిగిందన్నారు. దీనిలో 412 మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా వారిని బ్యాంక్ సిబ్బంది, అధికారులు చేసినట్లు తెలిపారు.


జగిత్యాలలో దరఖాస్తులను పరిశీలిస్తున్న వార్డు అధికారులు

●**సారంగాపూర్:** రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ యువతకు వరం అని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకంలో బీసీలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

●**మల్లాపూర్:** రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల ఇంటర్వ్యూలు సోమవారం మల్లాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈనెల 23, 24న జరిగిన ఇంటర్వ్యూలలో పాల్గొన్న వారిలో సిబిల్ స్కోర్ లేని వారి వివరాలను గోడకు అతికించడంపై మోకు ప్రవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు అధికారుల తీరు పట్ల అగ్రహం వ్యక్తం చేశారు.

దరఖాస్తుదారుల అందరికి తప్పకుండా ఇంటర్వ్యూలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇంటర్వ్యూలు ఈనెల 28 వరకు కొనసాగుతాయిని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●**మల్యాల:** మల్యాలలో రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు సోమవారంతో ముగిశాయి. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందడానికి అధికారులు, బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..

మల్యాల, మే 26(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు మండల రిసోర్స్ కేంద్రంకు వచ్చాయి. మండలానికి 18529 అవసరం కాగా 16667 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. సోమవారం మండలంలోని పాఠశాలలకు సరఫరా చేసినట్లు ఎంఈవో ఎన్.జయసింహరావు తెలిపారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

మల్యాల, మే 26(ఆంధ్రజ్యోతి): ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని లంబాడిపల్లి, ముత్యంపేట, రామన్నపేట, తాటిపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోల్లు ముగిసినట్లు ఏపీఎం జీసీ రాజయ్య తెలిపారు. 863మంది రైతుల నుంచి రూ.11.26 కోట్ల విలువైన 48539.60క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

అన్నదానానికి విరాళం

మల్యాల, మే 26(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యన్నదానం పథకంకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.25వేల విరాళం అందజేశారు. బల్మూరి శ్రియ, శ్రీనివాస్‌రావు అనే భక్తులు నగదును ఆలయ అధికారులకు అందజేశారు.

బీజేపీ శ్రేణుల తిరంగా యాత్ర

సారంగాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయోత్సవాన్ని పురష్కరించుకుని మండల కేంద్రంలో సోమవారం మండల అధ్యక్షులు రెంటం జగదీష్ ఆధ్వర్యంలో తిరంగ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుండి పాఠశాల వద్దకు త్రివర్ణ పతాకాలతో ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో కంచర్ల శివ, నాగేందర్, శేఖర్, రమేష్, అంజి, వంశి, మల్లేశం, గంగారెడ్డి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు గుర్తింపు దక్కే వరకు పోరాటం

ఇబ్రహీంపట్నం, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరంగా, కుల సంఘాల పరంగా, పార్టీల పరంగా జగిత్యాల జిల్లాలో ఉన్న యాదవులకు గుర్తింపు దక్కే వరకు పోరాటం చేస్తామని యాదవ సంఘం అడహాక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. మండలంలోని అమ్మక్కపేట గ్రామ యాదవ సంఘ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కలిసి పాల్గొని సభ్యత్వ నమోదుతో సంఘ బలోపేతంపై చర్చించారు. అనంతరం అమ్మక్కపేట గ్రామ యాదవ సంఘ సభ్యులు మొత్తం మంది సభ్యత్వం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో అమ్మక్క పేట గ్రామ యాదవ సంఘ పెద్ద మనుషులు, సంఘ సభ్యులు జక్కుల మనోజ్ యాదవ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

కథలాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేయాలని పీసీసీ కార్యదర్శి జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు వైద్యుల అంజన్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎస్సారార్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణంపై సన్నాహక సమావేశంకు హాజరై కార్యకర్తలతో మాట్లాడారు. బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీపై అబద్ధపు ప్రచారం చేస్తున్నందు వల్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అదే స్థాయిలో తిప్పి కొట్టాలని సూచించారు. రాహుల్ గాంధీ, సోనియాగాంధీలపై నేషనల్ హెరాల్డ్ పత్రికకు మనీలాండరింగ్ రూపంలో డబ్బులు పోగు చేశారంటూ నరేంద్రమోదీ ప్రభుత్వం కేసులు నమోదు చేయించడం దారుణమని ఆరోపించారు. స్వాతంత్ర సమరం సమయంలో కాంగ్రెస్ పార్టీకి నేషనల్ హెరాల్డ్ పత్రిక కీలక భూమిక పోషించిందని ప్రస్తుతం దివాలా తీసిందన్నారు. అయితే ఆ పత్రికను పునరుద్ధరించడానికి విరాళాలు పోగు చేసుకుంటే మోదీ సర్కారుకు మింగుడు పడలేదన్నారు. రాజీవ్‌గాంధీ దేశంలో ఐటీ విప్లవంకు పునాది వేశారని దాంతో వేలాది ఉద్యోగాలు నిరుద్యోగ యువతకు దక్కాయని గుర్తు చేశారు. మతతత్వ పార్టీ బీజేపీ మతం పేరిట జనాలను రెచ్చగొట్టి ఓట్లు దండుకుంటోందని ఆరోపించారు. కార్యకర్తలు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి ఎప్పటికప్పుడు వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టాలని అన్నారు. పార్టీలో కష్టించే వారికి పదవులు దక్కుతాయని ఎవరూ నిరాశ చెందవద్దని పేర్కొన్నారు. కలిసి కట్టుగా పనిచేసి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. మండల, బ్లాక్, డివిజన్, గ్రామ స్థాయి అధ్యక్షుల ఎంపికకు సంబంధించి పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డీసీసీ అధ్యక్ష స్థానం కోసం చింతకుంటకు చెందిన చెదలు సత్యనారాయణ దరఖాస్తు చేసుకున్నారు. అధ్యక్ష స్థానం కోసం 13, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష స్థానం కోసం 7 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, పులి హరిప్రసాద్, కల్లెడ గంగాధర్, ఎగ్యారపు శ్రీహరి, అల్లకొండ లింగంగౌడ్, వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.


డీసీసీ పదవి కోసం దరఖాస్తు స్వీకరిస్తున్న అంజన్‌కుమార్